www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -90 ఆదివారం 29 జూన్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'..




- శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోదీ!
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా
- శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ
- భారత మానవసహిత యాత్ర గగన్‌యాన్‌కు ఇది తొలి అడుగు అని పేర్కొన్న ప్రధాని
- అంతరిక్షం నుంచి చూస్తే భూమిపై సరిహద్దులే కనిపించవన్న శుక్లా

**జూన్28ప్రజావినికిడి:**
భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాడు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణలో భాగంగా శుక్లా 'భారత్ మాతా కీ జై' అని నినదించారుమిగతాది 2లో...

# కంచగచ్చిబౌలి భూములను అభివృద్ధి చేస్తాం

### పిజెఆర్ ప్లై ఓవర్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

- 2029లో నియోజకవర్గాల పునర్విభజన
- జంటనగరాల దాహార్తిని తీర్చిన ఘనత పిజెఆర్‌దే
- పిజెఆర్ ఇల్లు జనతా గ్యారేజ్ లాగా ఉండేది



హైదరాబాద్,,**జూన్28ప్రజావినికిడి:**
2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని.. శేరిలింగంపల్లి 4 నియోజకవర్గాలుగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో పీజేఆర్‌ది కీలకపాత్ర అని కొనియాడారు. పీజేఆర్ కృషి వల్లే హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలు వచ్చాయని ఉద్ఘాటించారు. శనివారం పీజేఆర్ ఫ్లై ఓవర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఆటంకాలను అధిగమించి కంచ గచ్చిబౌలిని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్కడి భూముల్లో అభివృద్ధి ఆటంకాలు తాత్కాలికమేనని, కంచ గచ్చిబౌలిలో కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. కొండాపూర్–గచ్చిబౌలి మార్గంలో 6 లైన్లతో 1.2 కిలోమీటర్ల పై వంతెనను ప్రభుత్వం నిర్మించింది. రూ.182.72 కోట్ల వ్యయంతో గచ్చీబౌలి నుంచి కొండాపూర్ వరకు వంతెన నిర్మాణం చేపట్టింది. మిగతాది 2లో...




## ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15 నుంచే

2లో

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై చంద్రబాబు సమీక్ష

ఎన్నికల వేళ సూపర్ సిక్స్ హామీలు

హామీల అమలుకు కసరత్తులు చేస్తున్న కూటమి ప్రభుత్వం

# నేడు పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభం

- అమిత్ షా చేతలు మీదుగా బోర్డుకు శ్రీకారం
- ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత బిజెపిదే
- నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్



**నిజామాబాద్,జూన్28ప్రజావినికిడి:**పసుపు బోర్డు సాధించడం, ఇక్కడే బోర్డు కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం నిజామాబాద్ రైతుల విజయమని ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో పసుపుబోర్డు కార్యాలయాన్ని హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నారు. ఉదయం 11.25 గంటలకు గుజరాత్ లోని అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట విమానశ్రయానికి చేరుకోను న్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు బేగంపేట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో




## 'రా' కొత్త చీఫ్ గా పరాగ్‌జైన్

2లో

ప్రస్తుత చీఫ్ రవి సిన్హా స్థానంలో బాధ్యతలు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న జైన్

ఇంటెలిజెన్స్ వర్గాల్లో 'సూపర్ స్లూత్'గా గుర్తింపు

ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన వైనం

జైన్ 1989 పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి

## బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధం

బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చివరి దశకు

రెండు తెలుగు రాష్ట్రాలకు ఒకేసారి కొత్త అధ్యక్షులు

నేడు నోటిఫికేషన్..రేపు నామినేషన్ -జూలై1న అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం

ఏపీ బీజేపీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం




2లో



## ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన కెసిఆర్

ప్రాజెక్టుల నిర్వహణను పట్టించుకోని నాటి పాలకులు

జూరాల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి ఉత్తమ్

గద్వాల,**జూన్28ప్రజావినికిడి:**పదేళ్ల కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ శాఖని భ్రష్టు పట్టించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్ట్‌లకు మాజీ సీఎం కేసీఆర్ మెయింటనెన్స్ చేయలేదని మండిపడ్డారు.శనివారం జూరాల ప్రాజెక్ట్‌ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిగతాది 2లో...

## టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్ దాడి

కేటీఆర్‌పై ప్రసారమైన కథనానికి నిరసన

ఫర్నిచర్, కార్లపై రాళ్లు, ఓ ఉద్యోగికి గాయాలు



**హైదరాబాద్, జూన్28ప్రజావినికిడి:**
హైదరాబాద్, ఫిలింనగర్‌లో ఉన్న మహా టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్‌వీ కార్యకర్తలు శనివారం దాడి చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై ప్రసారం చేసిన కథనానికి నిరసనగా రాళ్లు, కర్రలతో దాడి చేశారు. సుమారు 20 మంది కార్యకర్తలు కార్యాలయంలోని సామగ్రి, బయట ఉన్న కార్లు ధ్వంసం చేశారు. మిగతాది 2లో...

# ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15 నుంచే

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై చంద్రబాబు సమీక్ష

అమరావతి, **జూన్28ప్రజావినికిడి:** ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 'సూపర్ సిక్స్' లో మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి కల్పించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. పథకం అమలుతో పెరిగే ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇందుకు కొత్త బస్సులు కొనడం గానీ, అవసరమైతే అద్దెకు తీసుకోవడం గానీ చేయాలని సీఎం సూచించారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ విద్యుత్ ఆధారిత ఏసీ బస్సులే ఉండాలని, ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే, ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

**ఆర్థిక కష్టాలున్నా హామీలు నిలబెట్టుకోవాలి**

రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా... ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని... అదే సమయంలో ప్రజాధనం సద్వినియోగం కావాలని, ప్రతీ రూపాయి విలువైనదేనని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు. ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి... ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సమర్థత పెంచుకోవాలని చెప్పారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**వివిధ మోడళ్ల పరిశీలనకు సీఎం ఆదేశం**

"బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలి. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్... ఇలా ఏ బస్సు కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం... ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించండి. ఆర్టీసీనే పవర్ జనరేట్ చేసి.... ఈవీ బస్సులు వినియోగించగలిగితే ఎంతమేర మెయింటెనెన్స్ కాస్ట్ తగ్గుతుందనేది అంచనా వేయండి. పూర్తి స్థాయిలో కసరత్తు జరగాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అదనంగా 2,536 బస్సులు అవసరం**

కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. దీనికి రూ.996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. అలాగే బస్ స్టేషన్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉందని సీఎంకు అధికారులు వివరించారు.

**ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణిస్తారని అంచనా**

రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారు. వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉంది. అయితే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఇది 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి మహిళ సగటున వారానికి ఒకసారి అయినా ప్రయాణిస్తుంటారని తెలిపారు. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉంది. పథకం అమలు తర్వాత ఈ సంఖ్య 13.39 కోట్లకు పెరగొచ్చు. మొత్తమ్మీద ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుంది.

**అన్ని రాష్ట్రాలకన్నా ఉత్తమంగా రాష్ట్రంలో అమలు**

ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా... ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**57 శాతం పల్లె వెలుగు, సిటీ బస్సు సర్వీసులే**

మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయి. గత ఏడాదిలో ఇవి 67.76 కోట్ల కిలో మీటర్ల దూరం ప్రయాణించాయి. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మరో 17 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం రాష్ట్రానికి బస్సులు కేటాయించింది. రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు 750 ఈవీ బస్సులను కేంద్ర ప్రభుత్వం అర్బన్ ట్రాన్స్‌పోర్టు కింద అందిస్తోంది.

# కంచగచ్చిబౌలి భూములను అభివృద్ధి చేస్తాం

(మొదటి పేజి తరువాయి)

దీంతో గచ్చిబౌలి చౌరస్తా దగ్గర ట్రాఫిక్ సమస్య తగ్గనుంది. దీనిని ప్రారంభించిన అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధి కోసం చాలామంది హైదరాబాద్ వస్తుంటారని తెలిపారు పేదల నాయకుడిగా పీజేఆర్ గొప్పపేరు సంపాదించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ప్రజలు ఎప్పుడు పిలిచినా పలికే నాయకుడు పీజేఆర్ అని అభివర్ణించారు. గతంలో పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్‌లా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. జంటనగరాల్లో 25 ఏళ్లపాటు పీజేఆర్ శకం నడిచిందని గుర్తుచేసుకున్నారు. పీజేఆర్ మంత్రిగా ఉన్నప్పుడే హైటెక్ సిటీకి పునాది పడిందని తెలిపారు. హైటెక్ సిటీని ముందుకు తీసుకెళ్లింది చంద్రబాబే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. భాగ్యనగర అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలని కోరారు. అభివృద్ధిలో స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొందరూ అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం ముసుగులో అవాంతరాలు కల్పిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్‌లో ఆర్టీసీ డీజిల్ బస్సులు ఉండొద్దని నిర్ణయించాం. డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించాలని ఆదేశించాం. హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు ఇస్తున్నామని అన్నారు. ఆటోలు కూడా సిఎన్‌జి ఎలక్ట్రిక్ వెర్షన్‌లోకి మారాలి. హైదరాబాద్ నగరంలో అనేక నాలాలు, చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణలకు గురైన వాటిని హైడ్రా ద్వారా తొలగిస్తున్నాం. ఎన్ కన్వెన్షన్‌లో రెండెకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించి.. నటుడు నాగార్జున నిజమైన హీరో అనిపించుకున్నారు. రంగారెడ్డి జిల్లాకు శ్రీధర్‌బాబును ఇన్‌చార్జి మంత్రిగా చేశాం. రంగారెడ్డి జిల్లా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలి. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదు. రేపు అమిత్ షా తెలంగాణకు వస్తున్నారు.. మరోసారి కలిసి విజ్ఞప్తి చేస్తాం. రాజకీయాలు వదిలేసి హైదరాబాద్ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం.నేను దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లా. ప్రధాని సహా అనేకమంది కేంద్రమంత్రులను కలిశా. కానీ రాష్టాన్రికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదు. హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏం ఇచ్చారు. ఈ విషయం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలోచించుకోవాలి. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 మంది ఎంపీలను ఇచ్చారు. కేంద్రం నుంచి బీజేపీ నేతలు ఏం తెచ్చారో చెప్పగలరా' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 3 లేయర్లుగా తెలంగాణను విభజించాలనుకున్నాం. రాబోయే 100 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతాయి. కాలుష్యం కారణంగా నేడు ఢిల్లీలో నివసించలేని పరిస్థితి ఏర్పడింది. దేశ రాజధానిలో నివసించలేని పరిస్థితి వచ్చిందంటే పాలకులు సరైన ప్రణాళిక లేకపోవడమే కారణం. వర్షం వస్తే చెన్నై అతాలాకుతలమవుతోంది, బెంగళూరు నగరం ట్రాఫిక్‌లో చిక్కుకుంటోంది. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నుంచి మనం నేర్చుకోవాలి. హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. డీజిల్ బస్సులను నగరానికి అవతలకు పంపించే చర్యలు చేపట్టాం. నగరంలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం. ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలు కొంటున్న వారికి పన్ను లేకుండా చేస్తున్నాం. నాలాలు కబ్జాలకు గురవడం వల్లే నగరంలో ముంపు తీవ్రత పెరిగింది. చెరువుల్లో అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చి వేసింది. వరద నీళ్లు వెళ్లేందుకు చెరువుల్లేకుండా కొందరు కబ్జాలు చేశారు. బతుకమ్మకుంటను భారాస నాయకులు ఆక్రమించుకుంటే.. కబ్జా నుంచి విడిపించాం. హైదరాబాద్‌పై ఒత్తిడి పెరుగుతున్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని చేపట్టాం. 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గం నాలుగు నియోజకవర్గాలుగా మారబోతోంది. అందరికీ అభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం వస్తుంది' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించిన కెసిఆర్

(మొదటి పేజి తరువాయి)



వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేతలు సందర్శించారు. ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లను, 4,8 గేట్స్ ఐరన్ రోప్‌లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కమిషన్లకు కక్కుర్తి పడ్డారని ఆరోపించారు. భారీ వాహనాలను జూరాలపై నడపటం సేఫ్టీ కాదని ఆనాడే అధికారులు నిర్ధారించారని... కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జూరాల డ్యామ్‌కు అనుసంధానంగా మరో బ్రిడ్జికి రూ. 100 కోట్లు ఇప్పుడే మంజూరు చేస్తున్నామని ప్రకటించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. భారీ వాహనాల వల్ల జూరాల ప్రాజెక్ట్‌కు ప్రమాదం ఉందని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున రూ. 100 కోట్లు మరో బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. పదేళ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉండి ప్రాజెక్ట్‌లను పట్టించుకోకపోవడంతోనే దెబ్బతింటున్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో పూడికతీత పనులు కూడా చేపట్టలేదని ధ్వజమెత్తారు. జూరాల ప్రాజెక్ట్ పూడికతీత పనులు వెంటనే చేపడతామని స్పష్టం చేశారు. రూ.300 కోట్లతో రెండవ గ్యాంటి క్రెన్ మంజూరు చేస్తున్నామని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.నీటిని ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నింపేలా పనులు చేపడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 90శాతం పూర్తయినా నె÷-టటెంపాడు పనులను కూడా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో నె÷-టటెంపాడుకి రూ.2,753 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. డిసెంబర్ నాటికి వందశాతం పనులు చేసి నె÷-టటెంపాడు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మక్తల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. ఇరిగేషన్ శాఖలో 1100 మంది ఇంజనీర్లను నియమించామని ప్రకటించారు. ప్రతిపక్షాలు సాగు, నీటి ప్రాజెక్ట్‌లపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. ఇరిగేషన్ శాఖ అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు ముందుగా రావడంతో జూరాల ప్రాజెక్ట్ పనులు పూర్తి కాలేదని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాల నేతలు ప్రజలను భయాందోళనకు గురి చేశారని చెప్పారు. కాళేశ్వరం కుంగిపోతే ఏమికాదని మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు జూరాలపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ÷ర్ అయ్యారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూసిన.. వారు నమ్మరని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# నేడు పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి వినాయక్ నగర్ లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్నీ ప్రారంభించడానికి వెళ్లనున్నారు. ఇక, మధ్యాహ్నం 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించ నున్నారు. 2 నుంచి 2.30 వరకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలోనే ఉండనున్నారు. మధ్యాహ్నం 2.35 గంటలకు నిజామాబాద్ లోని కంటేశ్వర్ క్రాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన డి శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. 2.45 నుంచి 4 గంటల వరకు పాలిటెక్నిక్ గ్రౌండ్ లో జరిగే కిసాన్ మహా బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు. ఇచ్చిన హామీ ప్రకారం పసుపు బోర్డును సాధించు కున్నామని అన్నారు. 29వ తేదీన నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించడానికి కేంద్ర మంత్రి అమిత్‌షా వస్తున్నారని చెప్పారు. రైతు సభకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. దీంతో పసుపురైతులకు గిట్టుబాటు ధరలు దక్కడంతో పాటు, అంతర్జాతీయంగా ఎగుమతులకు అవకాశం పెరుగుతుందని అన్నారు. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేశారని అన్నారు.

# అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'..

(మొదటి పేజి తరువాయి)

.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. శుభాంశు శుక్లా ప్రయాణం దేశ ప్రతిష్ఠను మరింత పెంచిందని కొనియాడారు. "మీరు మిషన్ కోసం భౌతికంగా దేశానికి దూరంగా ఉన్నప్పటికీ, 140 కోట్ల మంది భారతీయుల హృదయాలకు చాలా దగ్గరగా ఉన్నారు. మీ ఈ చారిత్రక యాత్ర ఒక నూతన శకానికి నాంది పలుకుతుంది. ఇది మన దేశ మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు మొదటి అడుగు వంటిది. అంతరిక్షాన్ని అన్వేషించాలనే భారత విద్యార్థుల ఆకాంక్షలకు మీ విజయం మరింత బలాన్నిస్తుంది" అని శుక్లాను ఉద్దేశించి ప్రధాని అన్నారు. ఈ ప్రయాణం వికసిత భారత్ లక్ష్యానికి నూతన ఉత్తేజాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రధాని ప్రశంసలకు శుభాంశు శుక్లా వినమ్రంగా స్పందించారు. ఇది తన ఒక్కడి విజయం కాదని, యావత్ భారతదేశం సాధించిన సమష్టి విజయమని అన్నారు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు గర్వకారణంగా ఉంది. ఇక్కడి నుంచి మన దేశాన్ని మొదటిసారి చూసినప్పుడు, మ్యాప్‌లో చూసిన దానికంటే ఎంతో పెద్దదిగా, మహోన్నతంగా కనిపించింది. ఈ భూమి అంతా ఒకే ఇల్లు, మనమంతా ఒకే కుటుంబం అనే భావన కలుగుతోంది. ఇక్కడి నుంచి చూస్తే దేశాల మధ్య సరిహద్దులు, విభజన రేఖలు కనిపించవు, అంతా ఏకత్వమే కనిపిస్తుంది" అని తన అనుభూతిని పంచుకున్నారు.అమెరికాకు చెందిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వాయుసేనకు చెందిన శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లారు. ఆయనతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నీవ్‌స్కీ, హంగేరీకి చెందిన టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

# బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధం

హైదరాబాద్,**జూన్28ప్రజావినికిడి:** తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకాలకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఒకే రోజు బీజేపీ అధిష్ఠానం అధ్యక్షులను ప్రకటించనుంది. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని అధిష్ఠానం నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి, ఎంపీ పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి.. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. పాకా సత్యనారాయణ మాట్లాడుతూ? 'అంతర్గత ప్రజాస్వామ్యం పాటిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఆదివారం అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్ జారీ అవుతుంది. 30న ఉదయం 11 నుంచి 1 వరకూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. 30న మధ్యాహ్నం 1 నుంచి 2 వరకూ నామినేషన్ల స్క్రూటిని నిర్వహిస్తారు. సాయంత్రం 4 లోపు ఉపసంహరణకు గడువు. జూలై 1న అధ్యక్ష ప్రకటన, బాధ్యతల స్వీకరణ ఉంటుంది. జాతీయ కౌన్సిల్ పీసీ మోహన్ ఎన్నికల అబ్జర్వర్‌గా ఉంటారని చెప్పారు.అలాగే తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు బీజేపీ పార్టీ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి, కిషన్ రెడ్డిలు తెలుగు రాష్ట్రాలకు అధ్యక్షులుగా ఉన్నారు. నోటిఫికేఏషన్‌తో భాజపా సంస్థాగత ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. రెండురాష్ట్రాల్లోనూ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు పార్టీ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ నుంచి పలువురు పోటీలో ఉన్నారు. డికె అరుణ, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు,రామచంద్రరావులు ప్రధాన పోటీదారులగా ఉన్నారు.

# 'రా' కొత్త చీఫ్ గా పరాగ్‌జైన్

**జూన్28ప్రజావినికిడి:** భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) నూతన అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. జూలై 1 నుంచి పరాగ్ జైన్ రెండేళ్ల పాటు ఈ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తారు.1989 బ్యాచ్‌కు చెందిన పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్, గతంలో పంజాబ్ డీజీపీగా కూడా సేవలు అందించారు. 2021 జనవరి 1న ఆయన డీజీపీ హోదా పొందారు. ఆయన నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ జూన్ 2న ఆమోదముద్ర వేసింది.
గూఢచార వర్గాల్లో పరాగ్ జైన్‌కు 'సూపర్ స్లూత్' అనే పేరుంది. మానవ మేధస్సు (హ్యూమింట్), సాంకేతిక మేధస్సును (టెక్ఇంట్) సమర్థవంతంగా మిళితం చేసి క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతం చేయడంలో ఆయన దిట్ట అని అధికారులు చెబుతుంటారు. ఈ నైపుణ్యమే అత్యున్నత స్థాయి ఆపరేషన్లకు కీలకంగా నిలుస్తుందని వారు వివరిస్తున్నారు.ఇటీవల పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో పరాగ్ జైన్ కీలక పాత్ర పోషించారు. ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు చేసేందుకు ఆయన బృందం అందించిన ఇంటెలిజెన్స్ సమాచారం భారత బలగాలకు ఎంతగానో ఉపయోగపడింది.వీటితో పాటు, జమ్మూ కాశ్మీర్‌లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం కూడా పరాగ్ జైన్‌ను ఈ పదవికి ఎంపిక చేయడంలో దోహదపడింది. గతంలో ఆయన కెనడా, శ్రీలంక వంటి దేశాల్లోనూ భారత ప్రతినిధిగా దౌత్యపరమైన సేవలు అందించారు.

# టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్ దాడి

(మొదటి పేజి తరువాయి)

దాడిలో ఓ ఉద్యోగికి గాయాలయ్యాయి. దాడి సంగతి తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం తదితరులు ఆ కార్యాలయాన్ని సందర్శించి దాడిని ఖండించారు.
మహాటీవీ ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్‌వీ నేత గెల్లు శ్రీనివాస్‌తోపాటు ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, కేసీఆర్‌పై తప్పుడు వార్తలు ప్రసారం చేశారని పేర్కొంటూ మహాటీవీకి బీఆర్ఎస్ లీగల్ నోటీసులు పంపింది. మహాటీవీ విధానం మార్చుకోకపోతే పరువు నష్టం దావా, క్రిమినల్ డెఫమేషన్ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్టు కేటీఆర్ పేర్కొన్నారు.

# పివి జయంతి సందర్భంగా సిఎం తదితరుల నివాళి




హైదరాబాద్,**జూన్28ప్రజావినికిడి:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద పలువురు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. భారతరత్న పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళు లర్పించారు.పీవీ నరసింహా రావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహు భాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపిం చడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందులసామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.. పీవీకి నివాళులు అర్పించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. ఆర్థిక సంస్కరణల తో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు. భూ సంస్కరణలతో సమాజంలో సమానత్వానికి కృషి చేశారని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా కాంగ్రెస్ ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచిందన్నారు. తెలంగాణలో గత పదేళ్లు పాలించిన ప్రభుత్వం ధరణి తెచ్చి పేదలను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. పేదల హక్కులను కాపాడడానికి భూభారతి చట్టాన్ని తెచ్చామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యారంగం బలోపేతం పీవీతోనే సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..



**ప్రజావినికిడి, (ముషిరాబాద్):** తెలంగాణ ఉద్యమ కారులకు గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో ప్రకటించిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలంగాణ ఉద్యమకారులు హెచ్చరించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మోహన్ బైరాగి, చందన్న ప్రసాద్, కుమారస్వామి అధ్యక్షతన తెలంగాణ ఉద్యమ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో సమాలోచన సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 1969 తెలంగాణ ఉద్యమకారులు గొల్లపల్లి దయానంద్, బాలకిషన్ రావు, రాందాస్,రంగారెడ్డి, అన్వర్ పటేల్,ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, ఉద్యమకారుల సంఘాలు ఏక తాటిపైకి వచ్చి ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎప్పుడైతే ఉద్యమకారులు ఒత్తిడి పెంచుతారో అప్పుడే మన హక్కులను సాధించుకోగలుగుతామని తెలిపారు.మనం గొంతమ్మ కోరికలు కోరుతలేము ఇచ్చిన హామీను నెరవేర్చాలని అడుగుతున్నామని అన్నారు.ప్రభుత్వం తక్షణమే ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు.లేకుంటే తీవ్రతరంగా ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ప్రఫుల్ రాంరెడ్డి,సుల్తాన్ యాదగిరి,తుల్జా రెడ్డి, లావణ్య,పెద్ద యాదగిరి,సోమా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు స్వేచ్ఛకు టిడబ్ల్యుజెఎఫ్,హెచ్ఐయుజె నివాళి..

## బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్..





**ప్రజావినికిడి, (ముషిరాబాద్) :**
ఆత్మహత్యకు పాల్పడిన సీనియర్ జర్నలిస్ట్,కవయిత్రి స్వేచ్ఛకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్ఐయుజె) కమిటీలు నివాళు లర్పించింది. శనివారం పార్సిగుట్టలోని ఆమె తల్లిదండ్రుల నివాసం వద్ద స్వేచ్ఛ మృతదేహానికి టిడబ్ల్యుజెఎఫ్,హెచ్ఐయుజె నాయకులు పూలదండ వేసి అంజలి ఘటించారు. స్వేచ్ఛతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా టిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షులు మామిడి సోమయ్య,ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ చురుకైన జర్నలిస్టుగా ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొస్తూ,తన రచనలు,కవిత్వంతో ప్రజల్లో చైతన్యం నింపిన స్వేచ్ఛ అకాల మరణం దారుణమన్నారు. తెలంగాణ సమాజం నిఖార్సైన మహిళా జర్నలిస్టును కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. స్వేచ్ఛ మరణంపై అనేక అనుమానాలున్నాయనీ, నిస్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.స్వేచ్ఛ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.నివాళు లర్పించిన వారిలో టిడబ్ల్యుజెఎఫ్ ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం,బట్టిపాటి రాజశేఖర్,గుడిగ రఘు,రాధిక, కార్యదర్శులు సలీమా, చంద్రశేఖర్, హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్ కుమార్,నాయకులు లలిత,విజయ, తదితరులున్నారు. జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్వేచ్ఛ విజయం సాధించిన సంగతి తెలిసిందే.సొసైటీ తరుపున మేనేజింగ్ కమిటీ నాయకులు గోపరాజు,హష్మి,చారి తదితరులు స్వేచ్ఛ కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు.

# వాస్తవాలు రాస్తే జర్నలిస్టులను చంపేస్తారా..?

## ఇది నీచ సంస్కృతి - మీడియా సంస్థలపై దాడి చేస్తారా..?

### ఆర్ పి ఐ(ఏ)రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా (అథవాలే )నాయకులు..

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
వాస్తవాలు రాస్తే జర్నలిస్టులను చంపేస్తారా వారి సంస్థలపై దాడి చేస్తారా..? ప్రజాస్వామ్యంలో హింసను ప్రేరేపిస్తారా అంటూ ఆర్ పి ఐ(ఏ) రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియానాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీని ప్రశ్నించారు.నిజాలను నిర్భయంగా రాసే పత్రికలు,ఛానల్ లో మీద దాడులు చేయడం అత్యంత నీచమైన సంస్కృతి. బీఆర్ఎస్ నాయకుల బాగోతాలు ఒక్కొక్కటిగా బైటికి వస్తుండడంతో తట్టుకోలేక తమ ఆగ్రహాన్ని జర్నలిజంపై చూపిస్తున్నారు. ఇలాంటి దాడులు, మీడియాపై అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదు.గతంలో కూడా పలుమార్లు ఇలాంటి దాడులకు తగలబడ్డారు.ఆనాటి స్వరాజ్ ఉద్యమం నుంచి నిన్న మొన్నటి తెలంగాణ ఉద్యమం దాకా పత్రికా సంస్థలు చేసిన పోరాటాన్ని ఎవరు మరువలేరు. ప్రపంచానికి నాలుగవ స్తంభంగా ఉన్న పత్రిక వ్యవస్థను ఇలా శాసించడం దుర్మార్గం. మన చుట్టూ ఉన్న సమాజంలో ఏం జరుగుతుంది,







రాజకీయ నాయకులు ఏం చేస్తే ప్రజలు సంతోషిస్తారు.అనే విషయాలను ప్రతిరోజు పనిగట్టుకొని మనకు చెప్పేవే మీడియా అలాంటి మీడియా సంస్థల మీద,వార్తలు రాసే సంస్థల మీద పగబట్టినట్లుగా వ్యవహరించడం దారుణమైన సంఘటన.దీనిని ప్రతి ఒక్కరు ఖండించాల్సిందే. ఎన్నికలు వచ్చినప్పుడు మీడియాను నెత్తిన పెట్టుకొని తమ పనులు చేయించుకునే బీఆర్ఎస్ నాయకులు నిజాలు చెబితే ఓర్వ లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి నాయకులను ఆర్ పి ఐ(ఏ)రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా (అథవాలే )నాయకులు.. వదిలే ప్రసక్తే లేదు.ఇలాంటి నాయకులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో ఆర్ పి ఐ(ఏ)రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా అధ్యక్షులుపసుల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీటర్,జనరల్ సెక్రెటరీ రత్న ప్రసాద్,గడ్డం రవి,మహిళా ఇన్చార్జ్ రోజా రాణి,మహిళా అధ్యక్షురాలు స్నేహలత పాల్గొన్నారు.

# జయములివ్వు జగన్నాథ

## పాలమూరులో భక్తి శ్రద్దలతో జగన్నాథ రథయాత్ర.

### ఇస్కాన్ వృక్ష కేంద్రం పాలమూరు శాఖ ఆధ్వర్యంలో వైభవంగా జగన్నాధ రాతయాత్ర వేడుకలు..

**ప్రజావినికిడి,(మహబూబ్ నగర్):**
టీటీడీ కల్యాణ మండపం వద్ద ప్రారంభమైన వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణుని పూజలు చేసిన ఎంపీ డికెఅరుణ హరతులు ఇచ్చి,రథం లాగి జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన ఎంపీ డి.కె అరుణటీటీడీ కల్యాణ మండపం నుంచి న్యూ టౌన్ చౌరస్తా మీదుగా అంబేకర్ సర్కిల్, అశోక్ టాకీస్, గడియారం చౌరస్తా, తెలంగాణ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణ మండపం చేరుకున్న యాత్రపెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు,స్థానిక ప్రజలుప్రత్యేక ఆకర్షణగాజగన్నాథ రథయాత్రలో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచినా భక్తి గీతాలు, భజనల హరే రామ్.. హరే కృష్ణ నామస్మరణతో మర్మోగిన పాలమూరు పట్టణ పుర వీధులు అజగన్నాధుని ఆశీస్సులు పాలమూరు ప్రజలందరిపై ఉండాలి ప్రతియేట ఇస్కాన్ ఆధ్వర్యంలో ఇంత పెద్ద ఎత్తున పాలమూరులో జగన్నాథ రథ యాత్ర నిర్వహించడం అభినందనీయం ఈ దేశాన్ని 2047కల్లా వికసిత్ భారత్ గా తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు.ఈ తరుణంలో మన ప్రధాని మోదీ కి అ జగన్నాథుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటున్నా ఇకపై మనం చేసే ప్రతి పనిలోనూ విజయం ఇవ్వాలని జగన్నాతుని వేడుకుంటున్నాను.



# యాంకర్ సూసైడ్ నుంచి దృష్టి మళ్లించేందుకే

# మీడియా ఆఫీస్ పై దాడి:బండి సంజయ్

**ప్రజావినికిడి, (హైదరాబాద్):?**
మహాన్యూస్ చానల్ కార్యాలయంపై బీఆర్ఎస్ శ్రేణులు చేసిన దాడిని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. మహా న్యూస్‌పై కేసీఆర్ కుమారుడు కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.ఇది కేవలం భవనంపై మాత్రమే దాడి కాదని ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అని అన్నారు.ఈ మేరకు ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల వేదిక ద్వారా ఆయన స్పందించారు.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా మీ మద్దతుదారులు చాలా మంది మాపై అబద్ధాలు ప్రచారం చేశాని మేమెప్పుడైనా మీ ఇళ్లపైకి ఇలా గుంపులను పంపించామా అని



ప్రశ్నించారు.మహా న్యూస్ గతంలో మీకు సపోర్టు చేసిన రోజులు ఏమయ్యాయి? మీకు అండగా నిలబడితే ఒకలా లేకపోతే మరొకలా ప్రవర్తిస్తారా అని ప్రశ్నించారు.యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య అంశం మీద నుండి ప్రజల దృష్టి మరల్చడానికే ఈ దాడి కోసం బీఆర్ఎస్ తో సంబంధం ఉన్న వ్యక్తులను ప్రోత్సహిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు.మీ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి భయాన్ని ఉపయోగించినందుకు సిగ్గుపడాలన్నారు. మీరు కెమెరాలను బద్దలు కొట్టవచ్చు, నిజం కాదు.మీరు స్వరాలను నిశ్శబ్దం చేయవచ్చు,ప్రశ్నలను కాదు.మీరు ఛానెల్‌పై దాడి చేయవచ్చు,కానీ జర్నలిజంపై కాదు. మీరు కెమెరాలను ధ్వంసం చేయవచ్చు కానీ సత్యాన్ని ధ్వంసం చేయలేరని, గొంతు నొక్కొచ్చు కానీ ప్రశ్నించడాన్ని కాదు. చానల్ పై దాడి చేయవచ్చు కానీ జర్నలిజంపై కాదన్నారు.దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అన్నపూర్ణ కేంద్రాల పేరు మార్పు మంచి పద్దతి కాదు..

## అన్నపూర్ణ అంటే ఆకలి తీర్చే అమ్మలాగ అని ప్రతి తెలుగు వారి సెంటిమెంట్

### ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి..

**ప్రజావినికిడి,(షాద్ నగర్):** ప్రతి తెలుగు వారు అనపూర్ణ అనే పేరును ఒక పేరులా కాకుండా ఆకలి తీర్చే అమ్మలాగా భావిస్తారని అలాంటి సెంటిమెంట్ ఉన్న అన్నపూర్ణ కేంద్రాల పేరును మార్చి ఇందిరమ్మ క్యాంటీన్లుగా పేరు పెడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క నిర్ణయం సరైంది కాదని గత కొంతకాలం నుండి హైదరాబాద్ నగరంలో అన్నపూర్ణ భోజన కేంద్రాల ద్వారా ఎంతో మందికి 5 రూపాయలకే భోజనం అందించిందని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. ఈ రేవంత్ ప్రభుత్వానికి పేర్లు మార్చడం,విగ్రహాలు మార్చడమే సరిపోయిందని ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఇలా పేర్లు మార్చడం సరైంది కాదని ఎమ్మెల్సి నవీన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు.



# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి 50 లక్షలు మంజూరు

**దేవాదాయ శాఖ ఈఓ శివకుమార్**

**50 లక్షల నిధుల మంజూరు పట్ల సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లకు కృతజ్ఞతలు..**

**మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్**

**నిధుల మంజూరు పట్ల భక్తుల హర్షం**

**ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి పల్లకి సేవ**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో శివకుమార్ తెలిపారు. శనివారం దేవాలయంలో భజన భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయ స్వామి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, ప్రమోద్,కృష్ణ,సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో



దేవాదాయ శాఖ ఈవో శివకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ప్రభుత్వం దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు ఆయన వివరించారు.ఆ నిధులతో దేవాలయంలో గాలిగోపురం, మంటపం,మినీ రాజగోపురం వంటి నిర్మాణాలు చేపడతామని తెలిపారు.భక్తులు, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, దేవాలయ అభివృద్ధికి 50 లక్షల నిధులు మంజూరు



చేయడం పట్ల ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భగవంతుని ఆశీర్వాదంతో దాతలు, భక్తుల సహకారంతో దేవాలయాన్ని మరింత సర్వాంగ సుందరంగా నిర్మానాలు చేపడతామని తెలిపారు.దేవాలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ చేసిన వెంటనే స్పందించిన

# కొందుర్గు గ్రామ సెక్రెటరీ సురేఖ



ప్రజావినికిడి,(కొందుర్గు):మండల చెక్కలోని గూడ గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో నీటి వసతులు టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు గమనించి వెంటనే స్పందించి నీటి సదుపాయాలను బాత్రూమ్స్ రిపేర్ చేయించిన సెక్రెటరీ సురేఖ గారికి ప్రత్యేక ధన్యవాదాల తెలియజేసిన జి విజయ్ కుమార్ తోపాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# భక్తుడికి ప్రగతి దర్శనం.. ఇది నిదర్శనం..

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటన..

**ఎలికట్ట భవాని, చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామి, మామిడిపల్లి రామాలయాల అభివృద్ధికి రూ.50 లక్షల చొప్పున మంజూరు..**

**ఆలయాల ప్రగతి విషయంలో గత ప్రభుత్వానివి అన్నీ ప్రగల్భాలే**

**ఆలయాల అభివృద్ధికి కూడా శఠగోపం పెట్టిన ఘనులున్నారు.. ఎమ్మెల్యేను సత్కరించిన ఆలయ అభివృద్ధి కమిటీల సభ్యులు.**







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ఆధ్యాత్మిక చింతన కోసం ఆలయాలకు వచ్చే భక్తులకు దైవ దర్శనం మాత్రమే కాదు.. ప్రగతి దర్శనం కూడా కనిపించాలి..అప్పుడే ఆలయాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయి.అందుకే షాద్ నగర్ నియోజకవర్గంలోని మూడు ప్రముఖ ఆలయాలకు 50 లక్షల రూపాయల చొప్పున 1కోటి 50 లక్షల నిధులు మంజూరు చేశామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.ఇందులో భాగంగా ఫరూక్ నగర్ మండలంలోని ఎలికట్ట భవాని మాత ఆలయానికి రూ.50 లక్షలు, చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి ఆలయానికి రూ.50 లక్షలు, మామిడిపల్లి రామాలయానికి రూ. 50 లక్షలు వెరసి మొత్తంగా కోటిన్నర నిధులను ఎమ్మెల్యే మంజూరు చేయించారు.ఈ విషయాన్ని ఆయన స్వయంగా మీడియాకు తెలియజేశారు. "సిజిఎఫ్" నిధుల ద్వారా భక్తుల తక్షణ అవసరాలు తీర్చేందుకు ఈ నిధులు మంజూరు. చేసినట్లు వివరించారు. ఈ ఆలయాలకు సంబంధించి మామిడిపల్లి ఆలయ సమస్యను యువనేత నవీన్ గౌడ్,చౌడమ్మ గుట్ట ఆలయ సమస్యను శ్రీశైలం గౌడ్,భవాని మాత ఆలయ సమస్యను అక్కడి భక్తులు ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలరాజు మాజీ ఎంపిటిసి శ్రీశైలం తదితరులు ఆయన దృష్టికి తెచ్చారనీ వివరించారు. అంతేకాకుండా పలు సందర్భాలలో ఆలయాలను ప్రత్యక్షంగా పరిశీలించి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఈ నిధులు మంజూరు చేయడానికి ముందుకు రావడం పట్ల హర్షం అవుతుంది.

### అభివృద్ధి ఇలా..

ఆయా ఆలయాలకు సంబంధించి మంజూరు చేసిన నిధులతో అక్కడి ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టనున్నారు. చౌడమ్మ గుట్ట ఆలయాన్ని తీసుకుంటే ఇక్కడ భక్తుల అవసరాలకు అనుగుణంగా గదులు, గాలిగోపురం, మండపం నిర్మించనున్నారు. అదేవిధంగా భవాని మాత ఆలయంలో మౌలిక సదుపాయాలు,ప్రహరీ వంటివి ఏర్పాటు చేయనున్నారు. రామాలయానికి కూడా అవసరమైన సదుపాయాల కల్పన ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,గత ప్రభుత్వం రామేశ్వరం, ఎలికట్ట వంటి ఆలయాలకు కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. మేము వారిలా ప్రగల్భాలు పలకడం లేదని, దేవాలయాలకు కూడా శతగోపాలు పెట్టడం లేదని క్రమ పద్ధతిలో నిధులు మంజూరు చేస్తూ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో తనే స్వయంగా ఆలయాల అభివృద్ధికి సొంత డబ్బులు ఖర్చు చేసిన సంగతి గుర్తు చేశారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఆలయాలను ప్రగతి పథంలో నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు.ఆలయాలకు నిధులు మంజూరు చేసిన క్రమంలో ఆయా ఆలయాల నిర్వహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లకు బిజెపి కేంద్ర ప్రభుత్వం వాటా ఎంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రజలకు చెప్పాలి..

**బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్**

**1705 కోట్ల రూపాయలను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద బిజెపి కేంద్ర ప్రభుత్వం కేటాయింపు**




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు తమ సొంత జాగాలో నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షల రూపాయలను అందించనుంది అందులో బీజేపీ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 1.50 లక్షలను అందిస్తున్న విషయం ప్రజలకి కనీసం తెలపకపోవడం కేవలం ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మేమే ఐదు లక్షల రూపాయలను అందిస్తున్నామని కేంద్ర వాటా ఇందులో ఏమాత్రం లేదని ప్రజలకు ప్రగల్భాలు పలుకుతున్నారు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఇండ్లు కేటాయించి ఇతరులను విస్మరించడం సరైనది కాదు కాబట్టి రానున్న లిస్టులలో తప్పనిసరిగా పార్టీలకతీతంగా నిజమైన అర్హులకు తమ సొంత జాగాలలో ఇల్లు కట్టుకోవడానికి తప్పకుండా అవకాశం కల్పించాలని ఈ ఇందిరమ్మ కమిటీలలో ఇతర రాజకీయ పార్టీలకు చెందిన వారిని కూడా పొందుపరచాలని నిష్పక్షపాతంగా వ్యవహారం జరగాలని, చాలామంది ప్రజలు 5 లక్షల రూపాయలు ముందే వస్తాయేమో అని కళ్ళకు ఒత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్న పరిస్థితి కానీ గుంతలు తీసి,పిల్లర్లు కట్టి సంపు,బేస్మెంటు, భరంతి నింపిన తర్వాతే డబ్బులు అనేవి విడుదల అవుతాయనేసరికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సగానికి పైగా సాంక్షన్ అయిన ఇందిరమ్మ ఇండ్ల పని మొదలు కానీ పరిస్థితి కాబట్టి తెలంగాణ ప్రభుత్వం వెంటనే చొరవచూపి ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఖర్చులు చాలా పెరిగిపోవడం వలన అదనంగా 2 లక్షల రూపాయలను అందించడం లేదా స్టీలు,సిమెంటు, ఇసుక,కంకర, ఇటుకలు మొదలగు వాటికి సబ్సిడీ ద్వారా వ్యత్యాసం కల్పించాల్సిన అవసరం ఎంతో ఉంది కాబట్టి ప్రభుత్వం వెంటనే ఈ యొక్క ఇందిరమ్మ ఇండ్లపై దృష్టి సారించి సాంక్షన్ అయ్యి ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టని వారితో చర్చలు జరిపి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని అధికారులను కోరుచున్నాము అని అన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించిన వ్యక్తి పై కేసు..

**మొయినాబాద్ తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్**

**కనకమామిడి సర్వే నం.510 మరో (3)ఎకరాలు స్వాధీనం.. -ప్రభుత్వ భూములు కొనడంనిషేధం..**





**ప్రజావినికిడి,(మొయినాబాద్):జూన్ 28:** ప్రభుత్వ భూముల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతమ్ కుమార్ మరోసారి హెచ్చరించారు.మొన్న తోల్కట్ట.నిన్న అజీజ్ నగర్ లో అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపిన రెవెన్యూ అధికారులు నేడు కనకకమామిడి గ్రామ శివారులో కేతిరెడ్డి పల్లి మార్గంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 510 లో అక్రమంగా ఫెన్సింగ్ వేసి కబ్జా చేస్తున్న సుమారు 15 కోట్ల విలువైన (3) ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయం తెలుసుకొని అక్కడికి చేరుకొని జేసీబి సహాయంతో పెన్సింగ్ తొలగించి ప్రీకాస్ట్ తో నిర్మిస్తున్న రూమ్ పనులను ఆపేసి అట్టి మెటీరియల్ ను తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో రెవెన్యూ అధికారుల విధులకు అడ్డుపడుతూ.ఏకంగా తహసీల్దార్ పైకి ఇది పట్టా భూమి అని వితండ వాదం చేస్తూ అధికారులు అడిగిన ఎలాంటి పత్రాలు చూపించకుండా గొడవకు దిగిన హైదరాబాద్ కి చెందిన ఇబ్రాహీం అనే వ్యక్తిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. స్వాధీనం చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.స్వాధీనం చేసుకున్న భూమిలో సూచిక బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ఫెన్సింగ్ వేస్తామని.తహసీల్దార్ తెలిపారు.ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం తీవ్ర నేరమని అసైన్డ్ భూమిని అమ్మితే కొంటే పివోటి చట్టంప్రయోగించి. స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు. తహసీల్దార్ వెంట గిర్దవర్ రాజేష్ రెవెన్యూ సిబ్బంది.తదితరులు ఉన్నారు.

# ఆర్ఎన్ఐ లేని పత్రికల పై వేటు..




**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
టిఈఎల్ నెంబర్ లేకుండా పత్రిక లో ఊహాజనిత వార్తలు రాస్తే చర్యలు తీసుకోండి... పిఆర్ జి ఐ కఠిన ఆదేశాలు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కు ఆదేశాలు..త్వరలో జిల్లా డిపిఆర్ఓ లకు ఉత్తర్వులు ప్రెస్ రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం పై అ సత్య వార్తలు ప్రచురిస్తూ,దేశంలోని ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛ హరించే విధంగా కొన్ని ఆర్ ఎన్ ఐ లేని పత్రిక లు సత్య దూరం లేని వార్తలు ప్రచురించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అసంఖ్యాధికంగా పి డి ఎఫ్ పత్రికలు సోషల్ మీడియా ద్వారా ఫేక్ వార్తలు సృష్టిస్తున్నాయని వీటిపై చర్యలు తీసుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణ జిల్లా సీనియర్ పాత్రికేయులు ఎస్ నరహరి నాగేశ్వర ప్రసాద్,పిఆర్ జి ఐ న్యూ ఢిల్లీ అప్పీలు చేయగా ప్రెస్ రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా సదరు పిర్యాదు పై లోతుగా అధ్యయనం చేసి ఆర్ ఎన్ ఐ లేని పత్రికలపై వేటు కు రంగం సిద్ధం చేసింది కఠిన ఆదేశాలు జరీ చేస్తూ ఇక ముందు (ఆర్ఎన్ఐ) లేని పత్రికల వార్తలను ప్రామాణికంగా తీసుకోవద్దని తప్పుడు వార్తలు ప్రచురిస్తే చట్ట పరమైన చర్యలకు వెనుకాడబోవద్దని, అలాగే పత్రిక భాషలో వాడాల్సిన పదాలు పూర్తి స్థాయిలో పొందుపరిచి ఉత్తర్వులు జారీచేసింది దీని గమనించి రాష్ట్ర జిల్లా పౌరసంబంధాల అధికారులు పరిగణించాలని ఆర్ ఎన్ ఐ లేని పత్రికల పూర్తి సమాచారాన్ని సదరు జిల్లా పౌరసంబంధాల అధికారులు సేకరించి రాష్ట్ర కార్యాలయాలకు పంపాలని ఆదేశాలు జరీ చేశారు.

# మీడియా మీద గుండాయిజం ఏమిటి..

**నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**టీయూడబ్ల్యూజే (ఐజేయు) షాద్ నగర్ నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు శ్రీనివాస్..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ విషయంలో వార్తలు ప్రచురిస్తున్నారని అక్కసుతోనే బిఆర్ఎస్ శ్రేణులు మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించడాన్ని టీయూడబ్ల్యూజే (ఐజేయు) షాద్ నగర్ నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, తీవ్రంగా ఖండించారు. ప్రచురించే వార్త కథనాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్యంలో స్పందించి తీరు ఇది కాదని,తమపై వచ్చిన ఆరోపణలను మీడియా ముఖంగా ఖండించడం లేదంటే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి ఉంటుంది..కానీ మందబలం,డబ్బు బలం ను పోగేసుకొని ఫోర్త్ ఏస్టేట్ పై దాడికి పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.పదేళ్లు అధికారంలో ఉండి మీడియా స్వేచ్ఛను పూర్తిగా భరించి వేశారని,ఇప్పుడు ఉన్న వార్తలను ప్రచురిస్తుంటే గుండాయిజం చేయడమే కాకుండా దాడులు చేయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

# బీసీలకు 42% శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎలక్షన్ నిర్వహించాలి.

**జిల్లేడు చౌద్దరిగూడ బీసీ సేన మండల అధ్యక్షులు జయ శ్రీకాంత్.**



ప్రజావినికిడి,(షాద్ నగర్):జాతీయ బీసీ సేన సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అద్దేశాల మేరకు,జాతీయ బీ సీ సేన అధ్యక్షులు బర్క కృష్ణయ్య ఆధ్వర్యంలో కేవలం 45 రోజులలో కమిటీలు విజయవంతం చేససాము అని హైదరాబాద్ లోని అశోక్ హెూటల్ లో మీడియా సమావేశంలో మాట్లాడిన జయ శ్రీకాంత్,42% శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించినంత వరకు మా పోరాటం ఆగదు అని తెలిపారు.షాద్ నగర్ నియోజకవర్గంలో బీ సీ సేన ఒక ప్రభంజనం సృష్టిస్తుంది,గ్రామ గ్రామాన ప్రజలు బీ సీ సేనకి తండోప,తండోపాలుగా తరలి వస్తున్నారు, అతి కొద్ది రోజుల్లో బీ సీ సేన అనేది రాజకీయ పార్టీలకు,దడపుట్టే విధంగా తయారవుతుంది ప్రతి గ్రామంలో ఒక చాకలి ఐలమ్మలా మహిళలు తయారవుతన్నారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్నగర్ నియోజకవర్గ బీ సీ సేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ ఫుట్ ఓవర్ ఎక్స్టెన్షన్ బ్రిడ్జ్ నిర్మించాలి

**మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ కువినతి పత్రం అందజేత..**



**ప్రజావినికిడి,(కొత్తూరు):**సమస్యలపై స్పందించి వెంటనే ఉన్నత సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ యొక్క నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ కో కన్వీనర్ అమలాపురం నరసింహ గౌడ్ తిమ్మాపూర్ మాజీ ఎంపిటిసి,కొత్తూరు మున్సిపల్ బిజెపి అధ్యక్షులు అమడాపురం రణధీర్ గౌడ్ ,మున్సిపాలిటీ బీజేపీ కార్యదర్శి కోస్గి మల్లేష్,సీనియర్ నాయకులు ఏనుగు విజయభాస్కర్ రెడ్డి,వడ్ల ప్రభాకర్ చారి పాల్గొనడం జరిగింది.

# పివి నరసింహారావు తెచ్చిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం చేసాయి..

## తొలి తెలుగు ప్రధానిగా పివి కి ప్రత్యేక స్థానం..

## పీవీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ రజనీతుజ్ఞుడు స్వర్గీయ పీవీ నరసింహ రావు104 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రతినిధులతో కలిసి నివాళులు అర్పించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,పీవీ ఆలోచనలు,ఆయన ఆర్థిక–పార్టీ–భారత రాజకీయ రంగాల్లో ప్రవేశపెట్టిన సంస్కరణలు మన దేశాన్ని అభివృద్ధి మార్గంపైకి తీసుకెళ్లాయి. ఒక తెలుగువాడిగా దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన తొలి ప్రధామంత్రి గానే తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు.ఇవి భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ వేదికలో నిలిచేలా గ్లోబల్–ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు.ఈ కార్యక్రమంలో పట్టణఅధ్యక్షుడు కొంకళ్ళచెన్నయ్య,అగ్గనూర్ బస్వం,చెంది తిరుపతిరెడ్డి మురళీమోహన్(అప్పి)జ్మమద్ ఖాన్,అందే మోహన్,కొప్పునూరి ప్రవణ్,బచ్చలి నరేష్ రాజు దిలీప్ తదితరులు, పాల్గొన్నారు.

# బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని సారేగూడెం శ్రీ లక్ష్మీ నగర్ లో నిన్న సాయంత్రం గ్రామస్థులు ఏర్పాటు చేసిన బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి,తాజా మాజీ కౌన్సిలర్ మహేందర్ యాదవ్,పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య, బీఅర్ఎస్ దుండిగల్ మున్సిపాలిటీ జెనరల్ సెక్రటరీ కోల్తుర్ మల్లేష్ ముదిరాజ్,వార్డు ప్రెసిడెంట్ శంభీపూర్ సుదర్శన్,నాయకులు కొత్తగూడెం శ్రీశైలం ముదిరాజ్,కొత్తగూడెం యాదగిరి,నాగార్జున, బాల్ రాజు,శ్రీకాంత్, కాలనీ ప్రెసిడెంట్ నాదెండ్ల నాగరాజు, కాలనీ సభ్యులు మురళి,రామ్ బాబు, నవీన్,విజయ్, మచేందర్,వీరస్వామి, శ్రీను, స్థానికులు, గ్రామస్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జొఫ్లొ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్..

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** హైదరాబాద్ మల్లాపూర్ జొఫ్లొ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల విన్నపం మేరకు మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్మిక యూనియన్ అధ్యక్షులు కూన శ్రీశైలం గౌడ్ జొఫ్లొ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించి ఎంప్లాయిస్ యూనియన్ సమస్యలపై కంపెనీ ఎండీ తో మాట్లాడడం జరిగింది.అనంతరం కూన శ్రీశైలం గౌడ్ కార్మికులతో కలిసి ఐఎన్టియూసీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ,జొఫ్లొ ఎంప్లాయిస్ యూనియన్ అగ్రిమెంట్, ఎంప్లాయిస్ ఇంక్రిమెంట్ వాటిపై కంపెనీ ఎండీ శ్రీనివాస్ తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.కార్మికుల, కర్షకుల సమస్యలపై నిరంతరం పోరాడుతు..కార్మికులఅభివృద్ధికిదోహదపడతానన్నారు.కార్మికుల యూనియన్ ప్రెసిడెంట్ కూన శ్రీశైలం గౌడ్ ఎల్లప్పుడూ మాకు అండగా ఉంటారని జోఫ్లొ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జోఫ్లొ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ చంద్రమౌళి గౌడ్,వైస్ ప్రెసిడెంట్ వివన్ మూర్తి,కె. ప్రవీణ్,ట్రెజరర్ బాలకృష్ణ,జాయింట్ సెక్రెటరీ బాబు కుమార్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# తాటిపల్లి రాములు గౌడ్ ఘన విజయం..



**ప్రజావినికిడి,(రంగారెడ్డి):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని అనాజ్ పూర్ గ్రామంలో శనివారం నాడు గౌడ సంఘం ఎన్నికలు నిర్వహించడం జరిగింది.ఈ ఎన్నికలలో తాటిపల్లి రాములు గౌడ్ ప్యానల్ వాళ్లు 140 ఓట్లకు గాను 96 ఓట్లు రాములు గౌడ్ ప్యానల్ గెలుచుకొని ఘనవిజయం సాధించడం జరిగింది.



# నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

## 12 లక్షల 28 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు, శనివారం షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు,పట్టణాలకు చెందిన24 మంది లబ్ధిదారులకు మంజూరైన 12 లక్షల 28 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి అండగా ఉంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండల పార్టీ అధ్యక్షుడు లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన బోరెవెల్స్ సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి





**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లోని 21 డివిజన్ సాయి నగర్ స్మశాన వాటికలో నీరు లేక మరియు పాదచారులకు ఇబ్బంది పడుతున్నామని గత నేల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించి విన్నపించగా సదరు అధికారులతో మాట్లాడి మునిసిపల్ ఫండ్స్ ద్వారా నూతన బోరెవెల్స్ సీసీ రోడ్డు మంజూరు చేయించి శనివారం నూతన బోరెవెల్స్ మరియు సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ఎన్ఎంసి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి అనంతరం బస్తి వాసులు హర్షం వ్యక్తం చేస్తూ శాల్వాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ సెల్ కన్వీనర్ షెక్ బిక్కన్ షా, మల్లికార్జున్,ప్రవీణ్, నిర్మల,యాదమ్మ, చంద్రకళ,లక్ష్మి, అంజాద్,రఫాత్, మురళి,మీడ శ్రీను, అఖిల్,రహీమ్, వాజిద్,రవి,శేఖర్, సంజీవ రెడ్డి, ఉప్పలయ్య,కార్తీక్, సంతోష్, శ్రవణ్, వీరబాబు,నారాయణా రెడ్డి,మధు,వెంకన్న, విజయ్ మరియు బస్తి వాసులు పాల్గొన్నారు.

# ఇంద్రియ ఆదిత్య బిర్లా జ్యువెలరీ ప్రారంభోత్సవం..

**ప్రజావినికిడి,(దిల్ సూక్ నగర్): జూన్ 28**
దిల్సుఖ్ నగర్ లో ఇంద్రియ,ఆదిత్య బిర్లా జ్యువెలరీ 25 వ స్టోర్ ప్రారంభించారు.ఇంద్రియ ఆదిత్య బిర్లా జ్యువెలరీ ఒక సంవత్సరం కంటే తక్కువ సమయంలోనే, హైదరాబాద్‌లో నాల్గవ,దేశవ్యాప్తంగా తన 25వ స్టోర్‌ను ప్రారంభించడంతో ఒక ముఖ్యమైన మైలురాయిని జరుపుకుంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని కొత్త స్టోర్ లో కారిగారి గది పెళ్లికూతురు లాంజ్ వంటి ఆలోచనాత్మకంగా రూపొందించబడిన స్థలాలను కలిగి ఉండి,అన్ని వర్గాల వారికి వినియోగదారులకు ఆకర్షించే ఆభరణాలు, 5,000 కంటే ఎక్కువ ప్రత్యేకమైన డిజైన్‌లు 20,000 కంటే ఎక్కువ ఆభరణాల క్యూరేటెడ్ సేకరణతో,ఈ స్టోర్ ఆధునిక సున్నితత్వాలతో మిళితమైన చక్కటి హస్తకళకు ఒక వేడుక.కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా ఆభరణాలను అందుబాటులోకి తేవాలన్న నిబద్ధతకు ఇది




నిదర్శనం. ఇంద్రియ సీఈఓ సందీప్ కోహ్లీ మాట్లాడుతూ, "ఇంద్రియ కేవలం వ్యక్తిత్వాన్ని మాత్రమే కాకుండా దానిని రూపొందించే గొప్ప సాంస్కృతిక,కళాత్మక వారసత్వాన్ని కూడా జరుపు కుంటుందన్నారు. మా తత్వశాస్త్రం విలక్షణమైన డిజైన్ వ్యక్తిగతీకరించిన సేవను,సంప్రదాయం పట్ల లోతైన గౌరవంతో మిళితం చేస్తుందన్నారు. భారతదేశంలో ఆభరణాలు వ్యక్తిగత వ్యక్తీకరణకు సంబంధించినంతవరకు వారసత్వానికి సంబంధించినవని అంగీకరిస్తుందన్నారు. రాచరిక వంశం, శక్తివంతమైన కళలు మరియు అభివృద్ధి చెందుతున్న డిజైన్ సున్నితత్వాలకు ప్రసిద్ధి చెందిన నగరమైన హైదరాబాద్,ఇంద్రియ నిరంతర విస్తరణకు అనువైన నేపథ్యాన్ని అందిస్తుందన్నారు.ఒక సంవత్సరంలోపు మా 25వ స్టోర్‌ను ప్రారంభించిన సందర్భంగా, ఈ మైలురాయి కాలాతీతమై నసమకాలీనమైన ఆభరణాలకు పెరుగుతున్న డిమాండ్ ఉందనే మా నమ్మకాన్ని బలపరుస్తుందని ఆయన అన్నారు.ఈ పెరుగుతున్న ఉనికి, దక్షిణ భారతదేశం యొక్క అభివృద్ధి చెందుతున్న అభిరుచులతో మరింత అర్థవంతంగా కనెక్ట్ అవ్వడానికి మాకు వీలు కల్పిస్తున్నామని వారు తెలిపారు.

# న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య...

## పూర్ణచందర్ రావు సంచలన లేఖ

### యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్ స్పందన

### మీడియాకు సంచలన విషయాలతో బహిరంగ లేఖ విడుదల

### స్వేచ్ఛ డిప్రెషన్‌కు తల్లిదండ్రులే కారణమని ఆరోపణ

### చిన్నతనం నుంచే ఆమెకు ప్రేమ కరువైందని వెల్లడి

### స్వేచ్ఛ కుమార్తె బాధ్యతలు తండ్రిలా తానే చూసుకున్నానన్న పూర్ణచందర్



**జూన్28ప్రజావినికిడి:**
ప్రముఖ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్ణచందర్ మౌనం వీడారు. స్వేచ్ఛ మరణానికి తానే కారణమంటూ ఆమె తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో, ఆయన మీడియాకు ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో ఆయన పలు సంచలన విషయాలను వెల్లడిస్తూ, స్వేచ్ఛ జీవితంలోని విషాద కోణాలను, ఆమెకు తనతో ఉన్న సంబంధాన్ని వివరించారు. తనపై వస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ఆపడానికే ఈ నిజాలు చెప్పాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు.

**2009 నుంచి స్నేహం, కానీ దగ్గరైంది 2020లోనే**
స్వేచ్ఛ తనకు 2009 నుంచి తెలుసని, ఇద్దరూ కలిసి టీ–న్యూస్‌లో పనిచేసేటప్పుడు మంచి స్నేహితులమని పూర్ణచందర్ తెలిపారు. ఆ సమయంలో స్వేచ్ఛ తన వ్యక్తిగత విషయాలను పంచుకునేదని గుర్తుచేసుకున్నారు. అయితే, 2020 నుంచే తమ మధ్య సాన్నిహిత్యం పెరిగిన మాట వాస్తవమని ఆయన అంగీకరించారు. రెండు విడాకుల తర్వాత తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడుతున్న స్వేచ్ఛకు తాను అండగా నిలిచానని వివరించారు.

**తల్లిదండ్రుల వల్లే స్వేచ్ఛ డిప్రెషన్‌లోకి వెళ్లింది**
స్వేచ్ఛ తీవ్ర మనోవేదనకు ఆమె తల్లిదండ్రులే ప్రధాన కారణమని పూర్ణచందర్ తన లేఖలో ఆరోపించారు. చిన్నతనంలోనే ఆమెకు తల్లిదండ్రుల ప్రేమ కరవైందని తెలిపారు. "గతంలో జనశక్తిలో పనిచేసే ఆమె తల్లిదండ్రులు, ఆరు నెలల వయసులోనే స్వేచ్ఛను బంధువుల వద్ద వదిలేసి వెళ్లారు. సంవత్సరానికి ఒకసారి చుట్టపుచూపుగా వచ్చి వెళ్లేవారని స్వేచ్ఛ ఎన్నోసార్లు నాతో చెప్పి బాధపడింది" అని పూర్ణచందర్ పేర్కొన్నారు. హైదరాబాద్ రాంనగర్‌లోని ఇంట్లో తల్లిదండ్రుల మధ్య నిత్యం జరిగే గొడవల కారణంగా ఆమె ఇంట్లో ఉండలేకపోయేదని ఆయన తెలిపారు.

**కూతురి బాధ్యతలు నేనే చూసుకున్నాను**
తల్లిదండ్రులతో ఉండలేక 2020లో స్వేచ్ఛ కవాడిగూడలో సొంతంగా అద్దె ఇల్లు తీసుకుని జీవించడం ప్రారంభించిందని పూర్ణచందర్ వివరించారు. 2022లో తన కుమార్తె అరణ్యను కూడా తన వద్దకే తెచ్చుకుందని తెలిపారు. "నా లాంటి జీవితం నా పాపకు రాకూడదు, నేనే దగ్గరుండి చూసుకోవాలని స్వేచ్ఛ ఎప్పుడూ చెప్పేది. 2022 నుంచి పాప బాధ్యతలను దాదాపు నేనే తీసుకున్నాను. ఆమె చదువు, ఇతర అవసరాలను ఒక తండ్రి స్థానంలో ఉండి చూసుకున్నాను" అని పూర్ణచందర్ లేఖలో వెల్లడించారు. స్వేచ్ఛ తన సంతోషాన్ని వార్తల్లో, తన కూతురిలో వెతుక్కునేదని, కానీ జీవితంలో ఎప్పుడూ సంతృప్తిగా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేఖతో స్వేచ్ఛ ఆత్మహత్య కేసు కొత్త మలుపు తిరిగింది. పూర్ణచందర్ వాదనలు, స్వేచ్ఛ తల్లిదండ్రుల ఆరోపణలతో ఈ కేసు మరింత సంక్లిష్టంగా మారింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మహాన్యూస్ ఛానల్ పై దాడి అమానుష చర్య..

**దాడి వెనుక ఎంతపెద్దవారున్నా చర్యలు తప్పవని హెచ్చరిక..**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై బిఆర్ ఎస్ మూకల దాడిని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు.ఇది అమానుష చర్య అని పేర్కొన్నారు.మీడియా సంస్థల కార్యాలయాలపై ఈ రకంగా భౌతిక దాడులకు పాల్పడడం, విధ్వంసం సృష్టించడం దారుణమని ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్షాన ప్రభుత్వం తరపున ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించారు. సంస్థలు,వ్యవస్థలపై పెయిడ్ ఆర్టిస్ట్ లతో ఈ విధంగా దాడులు చేయించడం ప్రజాస్వామ్యంలో సరైనదికాదని స్పష్టం చేశారు.పార్టీ పరంగా ఛానల్స్ నిర్వహిస్తూ పెయిడ్ ఆర్టిస్ట్ లతో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగపరుస్తూ ప్రభుత్వంపై ఇష్టమొచ్చిన రీతిలో బురద జల్లుతున్నారని అన్నారు.ఏదైతే నిజాన్ని నిర్భయంగా అధికార పక్షమనో,ప్రతిపక్షమనో తేడా లేకుండా ధైర్యంగా న్యూస్ ప్రచారం చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా గాని ధైర్యంగా న్యూస్ ప్రచురిస్తున్న ప్రింట్ మీడియాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అండగా ఉంటూ పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దాడులకు చోటులేదని అన్నారు.న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన వారి వెనుక ఎంతటి ఎంత పెద్దవారున్నా వదిలిపెట్టేదిలేదని దోషులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి దాడులను అరాచకాలను సహించేదిలేదన్నారు.

## దేశానికి పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయం..

**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు..**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** తెలంగాణ మట్టికి పుట్టిన పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం భారత మాజీ ప్రధాని,ఆర్థిక సంస్కరణల పితామహుడు పాములపర్తి వేంకట నరసింహారావు జయంతిని పురస్కరించుకుని పి.వీ ఘాట్ కి విచ్చేసిన ప్రభుత్వ సలహాదారులు హార్కర్ వేణుగోపాల్ తో పి.వీ కుమారులు ప్రభాకర్ రావు,సుభాష్, డీ.కె. అరుణ,వక్కలంక శ్రీనివాస్ రావు కలిసి పీ.వి. చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్కలంక మాట్లాడుతూ పీవీ నరసింహారావు ఓ సాధారణ రైతు కుటుంబం నుంచి దేశ ప్రధాని పదవి వరకు ఎదిగిన మహానేత అన్నారు.1991లో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉండగా, అద్భుతమైన నిర్ణయాలు తీసుకుని దేశ ఆర్థిక వ్యూహాన్ని మార్పు చేశారని, ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం కొనియాడారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు.

## మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

**: బిజెపి నాయకురాలు పద్మా రెడ్డి..**



**ప్రజావినికిడి,(నాగోల్):** మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని బిజెపి నాయకురాలు పద్మా రెడ్డి అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.పత్రికా విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని చెప్పారు.మీడియా ప్రసారాలు,కథనాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని తెలియజేసేందుకు చట్టపరమైన మార్గాలు ఉన్నాయని అన్నారు. మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం సహించరానిదని పద్మా రెడ్డి తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వాస్తవాలను ప్రజలకి వివరిస్తున్న మహాన్యూస్‌పై దాడి చేయడం అప్రజాస్వామికమని అన్నారు.మహాన్యూస్ ఛానల్‌పై జరిగిన ఈ దాడిని ప్రజాస్వామ్యవాద వాదులు అందరూ ఖండించాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఈ దాడికి పాల్పడిన వ్యక్తులపై ప్రభుత్వం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పద్మా రెడ్డి కోరారు..

## శ్రీ ప్రత్యంగిరా మాత దర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..





**ప్రజావినికిడి,(మహేశ్వరం):** మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్కేపురం డివిజన్‌లో కొలువై ఉన్న శ్రీ ప్రత్యంగిరా దేవి ఆలయాన్ని మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు,భక్తుల సౌకర్యాలపై సమీక్షించడమే కాకుండా, జరుగుచున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది-ఎమ్మెల్యేసుదీర్ రెడ్డి..



బాధిత భర్త పరంధామ కు1,50,000 రూపాయల ఎల్.ఓ.సీ.అందజేస్తున్న దేవిరెడ్డి సుదీర్ రెడ్డి

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**హస్తినపురం డివిజన్ పరిధిలోని నందనవనంకు చెందిన శ్రీలత కీళ్లవాపులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వారు నిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న నేపథ్యంలో వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 1,50,000(ఒక లక్ష యాబై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త అనిత,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**ధర్మసాగర్/జూన్28ప్రజావినికిడి:**హైదారాబాద్ లోజనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గారి నీ నివాసం లో శనివారం కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,వారు త్వరగా కోలుకోవాలని, ఆ కలియుగ దైవం తిరుపతి వేంకటేశ్వర స్వామి గారి కళ్యాణం లో అభిషేకం చేసిన లడ్డు అందించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ధర్మసాగర్ మండల మాజీ అధ్యక్షులు, దేవేందర్ ,సొంపల్లి కరుణాకర్ , అంబటి విష్ణు వర్ధన్,బొల్ల భరత్, వలిగే నాగరాజు తదితరులు ఉన్నారు.

## మహిళ అని చూడకుండా.. వివస్త్రను చేసి.. గుండు గీసి..



**ధర్మసాగర్జూన్28ప్రజావినికిడి:**హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయలలో అమానవీయ ఘటన జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓమహిళపై విచక్షణారహితంగా దాడిచేశారు కొందరు. ఇనుప గ్రిల్స్‌కు కట్టేసి వివస్త్రను చేసి అవమానించడంతో పాటు ఆమె జననాంగాలపై జీడి పోసి చిత్రవధ చేశారు. అనంతరం చిక్కుడు రాజుకు, బాధితురాలికి గుండు గీయించారు. రాజు భార్య గంగా, ఆమె తరపు బంధువులు ఈ దాడికి పాల్పడ్డారు. పలుమార్లు పంచాయితీలు పెట్టి హెచ్చరించినా ఇరువురి తీరూ మారకపోవడంతో ఇలా చేశామని అంటున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా కౌలే జగన్నాథం జన్మదిన వేడుకలు..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):జూన్ 28,** అఖిలభారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం జన్మదినం సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అలాగే విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షులు కంజర్ల కృష్ణమా చారి జగన్నాథంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. విశ్వబ్రాహ్మణ జాతి కొరకు అహర్నిశలు కృషి చేస్తున్న కౌలే జగన్నాథమును ఈటల రాజేందర్ అభినందించారు. వారు రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని సంపూర్ణ ఆరోగ్యంతో ఆయురారోగ్యంతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆపరేటర్

**సూర్యాపేటజూన్28ప్రజావినికిడి:** హుజూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు శనివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో భూ భారతి ఆపరేటర్ ఒక రైతు నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన తోట రాంబాబు అనే రైతుకు 12 ఎకరాల వారసత్వంగా వచ్చే గుర్తింపు ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీ ఇవ్వడానికి కంప్యూటర్, భూ భారతి డేటా ఎంట్రీ ఆపరేటర్ కర్నాటి విజేతారెడ్డి రూ.20 వేలు లంచంగా డిమాండ్ చేశాడు.ఈ ఒప్పందంలో భాగంగా బాధితుడు శనివారం రూ.12 వేలు ఇస్తుండగా నల్లగొండ ఎసిబి డిఎస్‌పి జగదీశ్ చందర్ ఆధ్వర్యంలో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కెమికల్ పరీక్షల అనంతరం నగదును స్వాధీనం చేసుకున్నారు. అవినీతికి పాల్పడ్డ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాంపల్లి ఫస్ట్‌క్లాస్ ఎసిబి స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరచనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## నేరాల నియంత్రణకు సమర్ధవంతంగా పనిచేయాలి

**- జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీస్**





**భూపాలపల్లి/జూన్28ప్రజావినికిడి:** పోలీసు అధికారులు, సిబ్బంది నేరాల నియంత్రణకు సమర్ధవంతంగా పనిచేయాలనీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీస్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్లలో నేరాల నమోదు, పెండింగ్ కేసులు, ఎన్ బి డబ్లు వారెంట్లు, ఎస్సి,ఎస్టీ కేసులు, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలు, పోక్సో కేసులు, కోర్టు మానిటరింగ్, శిక్షల అమలుపై చర్చించి, పోలీసు అధికారులకు మార్గనిర్దేశం చేశారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులను విజిబుల్ పోలిసింగ్ తో పాటు ప్రభావవంతంగా నిర్వర్తించాని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున పోలీసు అధికారులు, సిబ్బంది పకడ్బందిగా పని చేయాలని, గ్రామాలలో జరిగే శాంతి భద్రతల అంశాలను ముందస్తు సంచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల పనితీరు ను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన ఫంక్షన్ వర్టికల్ లలో ఎవ్వరికి కేటాయించినా విధులను వారు అప్డేట్ చేస్తూ మెరుగుపరచుకోవాలని సూచించారు. సైబర్ మోసాలపై, మహిళా భద్రతపై అవగాహన కల్పించాలనీ,సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సత్వరంగా సేవలు అందించాలని పేర్కొన్నారు. అలాగే అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, నిత్యం వాహన తనిఖీలు చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే గారు పేర్కొన్నారు. అలాగే జిల్లాలో రౌడి షిటర్స్ పై నిఘా ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి, కాటారం, వర్టికల్ డిఎస్పీలు సంపత్ రావు, సూర్య నారాయణ, నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకానికి శంకుస్థాపన

## ప్రజలకు సేవ చేయడమే కూటమి లక్ష్యం -కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం,జూన్28ప్రజావినికిడి:** :ప్రభుత్వాన్ని ఎదిరిస్తే ప్రభుత్వ పథకాలు కట్ చేయడం వంటి సంస్కృతి మా కూటమి ప్రభుత్వానికి లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన ఆయన.. పాతపట్నంలో 265 కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు.. పాతపట్నం నియోజకవర్గంలోని బూరగాం గ్రామంలో 265 కోట్ల రూపాయలతో ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లాగా ఇసుక మాఫియా, భూధందాలు, లిక్కర్ మీద సొమ్ము చేసుకోవడం లేదన్నారు.. ప్రభుత్వాన్ని ఎదిరిస్తే ప్రభుత్వ పథకాలు కట్ చేయడం వంటి సంస్కృతి కూడా మా కూటమి ప్రభుత్వానిది కాదన్నారు.. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు స్వాతంత్రం వచ్చేటట్లుగా స్వేచ్ఛగా ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని పేర్కొన్నారు.. ప్రజలు ఎవరైనా సమస్యలు పరిష్కరించుకుంటే మమ్మల్ని అక్కడికక్కడే నిలదీస్తే మేం వారిపై ఎటువంటి అధికార జులుం ప్రదర్శించకుండా.. సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు. మరోవైపు, శ్రీకాకుళం జిల్లాలో ఇండియా టర్న్స్ పింక్ సంస్థ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అ÷ూఖీ ద్వారా మహిళలకు ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.. ఈ కార్యక్రమం ద్వారా శ్రీకాకుళం జిల్లాలోని 10,000 మంది గ్రామీణ మహిళలకు ఉచితంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం మహిళలో అవగాహన పెంపొందించి క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం, తద్వారా జీవితాలను రక్షించడం అన్నారు.. ఈ కార్యక్రమంలో నాతో పాటు ంంఎ చైర్మన్ విపిన్ కుమార్, ఊఖీ సభ్యులు శ్రీనివాస్, ఇండియా టర్న్స్ పింక్ అధికారులు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్ ,బగ్గ రమణ మూర్తి పాల్గొన్నారు. గ్రామీణ సమాజాలలోని మహిళలకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ మరియు ముందస్తు రోగ నిర్ధారణ సేవలను అందించేందుకు మేం కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# చంద్రబాబు హామీల అమలులో ఘోర విఫలం.



**కాకినాడజూన్28ప్రజావినికిడి:**
ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల విమర్శించారు. జిల్లాల పర్యటనలో భాగంగా శనివారం కాకినాడ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కళా వెంకట్రావు భవనంలో జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. తొలుత స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ "సూపర్ సిక్స్" హామీలు అన్నీ కేవలం ప్రచార హంగుకు మాత్రమేనని, వాస్తవంలో అవి "సూపర్ ఫ్లాప్" అయ్యాయని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాలకు సాయమందిస్తామన్న మాటల వెనుక ఇప్పుడు ఆంక్షలు, నిబంధనలు పెట్టడం అన్యాయమని తెలిపారు.

ప్రజల తరపున పోరాడే పార్టీ – కాంగ్రెస్ మాత్రమే అన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నా, ప్రజల సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. "మహా సముద్రం లాంటి కాంగ్రెస్"లో ప్రాంతీయ పార్టీలు కలవడం అనివార్యమని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ బలంగా డిమాండ్ చేస్తోందని చెప్పారు. ఉక్కు కోసం ఉద్యమిస్తున్న ప్రజలకు మద్దతు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పునరుత్థానానికి కృషి కొనసాగుతుందని తెలిపారు. కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు నియోజకవర్గాల స్థాయిలో పర్యటనలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పార్టీకి అంతర్గతంగా ఉన్న వర్గ పోరులను నివారించి, అందరికీ సమాన ప్రాతిపదికన అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. పాతతరం నాయకులతో పాటు యువతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పార్టీకి కొత్త శక్తిని అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ కార్యకర్తలకు ధైర్యం కలిగిస్తూ, ప్రజల నమ్మకాన్ని పొందేందుకు నిరంతరంగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ వారిగా నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి, సీడబ్ల్యూసీ సభ్యులు డా.ఎంఎం. పళ్ళంరాజు, జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానంద రావు, నగర అధ్యక్షుడు చెక్కా నూకరాజు, ఐఎన్టీయూసీ అధ్యక్షుడు తాళ్ళూరి రాజు, గాంధీ రాజు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ మోసాలు పెరిగాయి

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత

**విజయవాడజూన్28ప్రజావినికిడి:**
"గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండండి. క్షణికావేశంలో వాటిని క్లిక్ చేస్తే మీ కష్టార్జితం మొత్తం సైబర్ నేరగాళ్ల పాలవుతుంది" అంటూ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయని, సాంకేతికతను మంచి కోసం ఎంతగా వాడుతున్నామో, చెడుకు కూడా అంతేస్థాయిలో వినియోగిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన 'సురక్షా 360' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

**టెక్నాలజీతోనే నేరాలకు అడ్డుకట్ట**

సైబర్ నేరాలతో పాటు, భౌతిక నేరాలను కూడా సాంకేతిక పరిజ్ఞానంతోనే అరికట్టగలమని మంత్రి అనిత స్పష్టం చేశారు. "రాష్ట్రంలో శాంతిభద్రతల




పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి వీధి, ప్రతి గ్రామాన్ని సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావడమే మా లక్ష్యం. టెక్నాలజీ వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందుండటం అభినందనీయం" అని ఆమె అన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి ఏర్పాటుతో రాష్ట్రవ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

**ప్రార్థనా మందిరాలకు 'సురక్షా' కవచం**

ఈ కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 28 'సురక్షా డివైస్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ పరికరాల ద్వారా ప్రార్థనా మందిరాల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, "ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజం సాధ్యం. 'సురక్షా 360' కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి భద్రతాభావం కల్పిస్తాం" అని భరోసా ఇచ్చారు.

# మహాటీవీ ఆఫీసుపై దాడి.. తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి

**దాడిని అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి**
**ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సమర్థనీయం కాదన్న ముఖ్యమంత్రి**
**దాడిని ఖండించిన మంత్రి కోమటిరెడ్డి**




హైదరాబాద్,**గుడివాడ మెయిల్, జూన్ 28:**
ప్రముఖ తెలుగు వార్తా ఛానల్ మహాటీవీ కార్యాలయంపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. మీడియా సంస్థపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులకు ఏమాత్రం తావులేదని రేవంత్ రెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు. మహా న్యూస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు ఎటువంటి స్థానం లేదని, మీడియా సంస్థలపై దాడులు చేయడం అంటే ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయాలనే దురుద్దేశంతో కూడిన చర్య అని ఆయన అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఈ ఘటనను నిర్దాక్షిణ్యంగా చూడాలని, ఈ దాడిలో పాలుపంచుకున్నవారితో పాటు, ఈ ?దాడి వెనుక నిలిచినవారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను సూచిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే మనందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు.

# పూరి రథయాత్రలో తొక్కిసలాట

## వందలాది మందికి తీవ్ర గాయాలు

## వివిధ ఆస్పత్రుల్లో వారికిచికిత్స



భువనేశ్వర్,**జూన్28ప్రజావినికిడి:**ఒడిశాలోని పూరి జగన్నాథ ఆలయంలో రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 625 మంది గాయపడ్డారు. స్థానిక మీడియా కథనం ప్రకారం చాలా మంది పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో మహిళలు, పిల్లలుఎక్కువ మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో జర్నలిస్టులు కూడా ఉన్నారని వార్తలొస్తున్నాయి. రథయాత్రను లాగుతున్న తాళ్లను పట్టుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ముందుకు రావడం వల్ల తొక్కిసలాట జరిగి ఒకరిపై ఒకరు పడిపోయారని మీడియా పేర్కొంది. ÷-షతగాత్రులలో దాదాపు 70 మంది పూరి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన వారు స్థానిక ఆసుప్రతుల్లో చికిత్స తీసుకుంటున్నారు. బాలగండి ప్రాంతానికి సమీపంలో జరిగిన రథయాత్రలో అనేక మంది గాయపడ్డారని వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్పందించారు. గాయపడిన వారికి చికిత్స అందించే విధంగా ఏర్పాట్ల చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# పివికి చంద్రబాబు, లోకేశ్ ఘన నివాళి

అమరావతి**జూన్28ప్రజావినికిడి:** మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నివాళు లర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. పీవీని స్మరించుకున్నారు. ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలను దేశ పరిస్థితిని మార్చేశాయని గుర్తు చేసుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని అంటూ కొనియాడారు. 'భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 104వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా ప్రధాని బాధ్యతలు స్వీకరించి ఆర్థిక సంస్కరణల ద్వారా దేశగతిని మార్చిన పీవీ ఎప్పటికీ స్ఫూర్తిగానే నిలుస్తారు. ఆ మహనీయుడి స్మృతికి మరొక్క మారు నివాళి అర్పిస్తున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# విజయనగరం ఉగ్రకుట్ర లింకుల కేసు

## ఎన్ఐఎకు బబదిలీ చేస్తూ ఆదేశాలు




అమరావతి**జూన్28ప్రజావినికిడి:** విజయనగరం ఉగ్రకుట్ర లింకుల కేసు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీ అయింది. సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌ల ఉగ్రకుట్ర కేసును కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వం ఎన్ఐఏకు అప్పగించింది. ఇద్దరు నిందితులు హైదరాబాద్, విజయనగరంతో పాటు దేశంలోని పలు చోట్ల బాంబు పేలుళ్లకు కుట్ర ప్లాన్ చేశారు. సిరాజ్, సమీర్‌లు ప్రస్తుతం విశాఖ సెంట్రల్ జైల్లో ఉన్నారు. త్వరలోనే నిందితులు ఇద్దరినీ ఎన్ఐఏ అదుపులోకి తీసుకోనుంది. ఇద్దరినీ ఎన్ఐఏకు అప్పగించేందుకు విజయనగరం పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. విజయనగరంకు చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ హైదరాబాద్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ఉగ్రవాద భావజాలం ఉన్న వారితో ఏర్పాటు చేసుకున్న సంబంధాలు, ఇతర కార్యకలాపాలపై ఎన్ఐఏ కొన్ని నెలలుగా కన్నేసి ఉంచింది. సికింద్రాబాద్ బోయగూడకు చెందిన సయ్యద్ సమీర్‌తో కలిసి సిరాజ్ భారీ పేలుళ్ల కుట్రకు పథకం రూపొందించి.. అమలు చేసే దశలో దొరికిపోయాడు. మే 16న సిరాజ్, సమీర్‌లను విజయనగరం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా.. అందుకు న్యాయస్థానం అంగీకరించింది. ఎన్ఐఏ, యాంటీ బాంబ్ స్క్వాడ్, మిగిలిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ విజయనగరంలో ఇద్దరినీ వారం రోజుల పాటు విచారించారు. గడువు ముగిసిన వెంటనే సిరాజ్, సమీర్‌లను కోర్టులో హాజరుపర్చగా.. మరోసారి రిమాండ్ విధించడంతో విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి నుంచి సేకరించిన ఆధారాలపై ఇంకా లోతైన దర్యాప్తు అవసరమని ఎన్ఐఏ భావించింది. కేసును ఎన్ఐఏకు అప్పజెప్పాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశాలను జారీ చేసింది. ఈ ఇద్దరు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్, చెన్నై, ముంబై, ఢిల్లీలోని ఎన్ఐఏ అధికారులు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. సౌదీలో ఉన్న ఇమ్రాన్ సహాయంతో పేలుళ్లకు సిరాజ్ చేశాడు. ఇమ్రాన్ పంపిన డబ్బులతో సిరాజ్ పేలుడు పదార్థాలను కొనుగోలు చేశాడు.

# తిరుమల యాత్రికులకు బీమా



తిరుపతి**జూన్28ప్రజావినికిడి:**–శ్రీవారి దర్శనం కోసం తిరుమల వచ్చే యాత్రికులందరికీ బీమా సదుపాయం కల్పించే దిశగా టీటీడీ యోచిస్తోంది. దీనిపై ఇంకా స్పష్టమైన ప్రతిపాదన రూపుదిద్దుకోనప్పటికీ సాధ్యాసాధ్యాలపై పాలక, అధికారవర్గాల్లో ఆలోచన మొదలైంది. అయితే రోజువారీగా భారీగా వచ్చే భక్తులకు బీమా కల్పించడం సాధ్యమేనా? దర్శనంటికెట్ గానీ, టైమ్ స్లాట్ టోకెన్ గానీ లేకుండా వచ్చే సర్వదర్శనం భక్తుల మాటేమిటి? అంటూ తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఈ నెల 17న తిరుమలలో జరిగిన టీటీడీ పాలకమండలి అత్యవసర సమావేశంలో అజెండాతో సంబంధం లేకుండా తిరుమల యాత్రికులకు బీమా సదుపాయం కల్పించడంపై కొందరు పాలకవర్గ సభ్యులు, అధికారుల మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. తిరుమల వచ్చి వెళుతున్న భక్తులు అనారోగ్యం బారిన పడినా, గాయపడినా ఇప్పటి వరకూ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు. అలాగే ఎవరైనా అనారోగ్యంతోనో లేక ప్రమాదాల్లోనో మరణిస్తే ఎక్స్‌గ్రేషియా తరహాలో ఆర్థిక సాయం అందిస్తున్న ఉదాహరణలూ ఉన్నాయి. తిరుమల ఘాట్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నారు. అరుదుగా మరణాలు కూడా సంభవిస్తున్నాయి. వీటికి తోడు నడక దారిలో వన్యప్రాణుల మూలంగా భక్తులకు ప్రమాదం పొంచి ఉంటోంది. అయితే ఈ ఘటనల్లో ఎప్పుడూ టీటీడీ పెద్దగా ఒత్తిడికి లోను కాలేదు. బీమా సదుపాయం గురించి ఆలోచించింది లేదు. అయితే ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన టీటీడీని కుదిపివేసింది. ఆ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి టీటీడీ ఆర్థిక సాయం చేసింది. అప్పటి నుంచే యాత్రికులకు బీమా సదుపాయం కల్పించాలన్న ఆలోచన మొదలైంది. కాకపోతే దానిపై సీరియస్‌గా దృష్టి సారించలేదు. అధికారులు, పాలక మండలి సభ్యుల మధ్య మాత్రం తరచుగా ఈ విషయమై చర్చ మాత్రం నడుస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# 'హరిహర వీరమల్లు' ట్రైలర్ జూలై 3న రిలీజ్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చారిత్రక చిత్రం 'హరి హర వీరమల్లు' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చింది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను జూలై 3న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రం విడుదల తేదీని కూడా ఖరారు చేసింది. జూలై 24న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.మొఘల్ కాలం నాటి కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ మునుపెన్నడూ చూడని శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. మొఘల్ పాలకుల అధికారాన్ని ధిక్కరించి, ప్రజల పక్షాన నిలిచిన 'వీరమల్లు' అనే బందిపోటు యోధుడి సాహసగాథగా ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును దర్శకుడు ఏఎం జ్యోతికృష్ణ పూర్తి చేశారు. అంతకుముందు, క్రిష్ జాగర్లమూడి ఈ చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో శ్రద్ధతో తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి అందించిన సంగీతం ఇప్పటికే పెద్ద విజయం సాధించింది. విడుదలైన నాలుగు పాటలు సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుని సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ భారీ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తుండగా, నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. వీరితో పాటు పలువురు ప్రముఖ నటులు ఈ సినిమాలో భాగమయ్యారు.జ్ఞానశేఖర్ వి.ఎస్., మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కె.ఎల్. ప్రవీణ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఏ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పిస్తున్నారు. ట్రైలర్ విడుదలతో సినిమా ప్రమోషన్లను వేగవంతం చేసి, జూలై 24న అత్యంత భారీ ఎత్తున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# మృణాల్ రెండు పడవల ప్రయాణం!



రాజమౌళి, కన్నడ రాకింగ్ స్టార్ యష్‌ల తరహాలో టీవీ సీరియల్ నుంచి వెండితెరపై ప్రత్యక్షమైన మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్. 'సీతారామం'తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించిన మృణాల్ విభిన్నమైన పాత్రలని ఎంచుకుంటూ కథానాయికగా హిందీ, తెలుగు భాషల్లో మంచి గుర్తింపుని సొంతం చేసుకుంది. మాతృభాష మరాఠీలో సినిమాలు తగ్గించి కేవలం హిందీ, తెలుగు భాషలపైనే ప్రత్యేక దృష్టిపెట్టింది. తెలుగులో నటించిన తొలి చిత్రం 'సీతారామం'తో మంచి మార్కులు కొట్టేసిన మృణాల్ ప్రస్తుతం ఆరు క్రేజీ ప్రాజెక్టులలో నటిస్తోంది. అందులో రెండు తెలుగు సినిమాలు, నాలుగు హిందీ మూవీస్. ఇందులో ముందుగా అజయ్‌దేవగన్ నటిస్తూ నిర్మిస్తున్న 'సన్నాఫ్ సర్దార్ 2' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీన్ని 'సన్నాఫ్ సర్దార్'కు సీక్వెల్‌గా రూపొందించారు. తెలుగు హిట్ ఫిల్మ్ 'మర్యాద రామన్న' ఆధారంగా 'సన్నాఫ్ సర్దార్' రూపొందిన విషయం తెలిసిందే. అయితే తెలుగులో సీక్వెల్ చేయకుండానే కొత్త కథతో అజయ్‌దేవ్‌గన్ 'సన్నాఫ్ సర్దార్'కు సీక్వెల్‌ని చేస్తున్నాడు. ఇందులో అజయ్‌కి జోడీగా మృణాల్ కనిపించనుంది. యాక్షన్ కామెడీగా రూపొందుతున్న ఈ మూవీని జూలై 25న భారీగా రిలీజ్ చేస్తున్నారు. ఇందులో మృణాల్ పంజాబీ అమ్మాయిగా కనిపించనుంది. దీనితో పాటు హిందీలో మరో మూడు సినిమాలు చేస్తోంది. హై జవానీతో ఇష్క్ హోనా హై, తుమ్ హోతో, పూజా మేరీ జాన్ వంటి సినిమాల్లో నటిస్తోంది. ఇక తెలుగులో అడివి శేష్ నటిస్తున్న 'డెకాయిట్' చేస్తోంది. శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ అవకాశాన్ని మృణాల్ దక్కించుకుంది. ఇక ఈ సినిమాతో పాటు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ మూవీలోనూ మృణాల్ ఠాకూర్ నటిస్తోంది. దీపికా పదుకునే మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో మృణాల్ ఠాకూర్ కూడా మరో హీరోయిన్‌గా కనిపించనుంది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ మృణాల్ ఠాకూర్ కెరీర్‌కు ఓ మైలురాయిలా నిలిచే అవకాశం ఉందని, ఈ సినిమాతో స్టార్ హీరోయిన్‌ల జాబితాలో మృణాల్ చేరుతుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. హిందీతో పాటు తెలుగులోనూ క్రేజీ సినిమాల్లో నటిస్తూ రెండు పడవల ప్రయాణాన్ని సాఫీగా సాగిస్తున్న మృణాల్ రానున్న రోజుల్లో భారీ విజయాల్ని దక్కించుకుని స్టార్ హీరోయిన్‌ల జాబితాలో చేరడం ఖాయం.

# బిజీ లైఫ్‌లోనూ బంధం బలంగా.. చైతూ, శోభిత సీక్రెట్ ఇదే!



యువ సామ్రాట్ నాగ చైతన్య, నటి శోభిత ధూళిపాళ వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నా తమ వైవాహిక బంధం బలంగా ఉండేందుకు ఒక కచ్చితమైన నియమాన్ని పాటిస్తున్నామని వెల్లడించారు. గతేడాది వివాహ బంధంతో ఈ జంట ఒక్కటైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తమ వ్యక్తిగత జీవితాన్ని ఎంతో ఆనందంగా గడుపుతున్నామని చైతన్య తెలిపారు. తాజాగా ఓ ప్రముఖ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన పర్సనల్ లైఫ్, వృత్తిపరమైన ఆసక్తుల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.వివాహం తర్వాత తమ జీవితం ఎంతో సంతోషంగా సాగుతోందని నాగ చైతన్య అన్నారు. కెరీర్ పరంగా ఇద్దరూ క్షణం తీరిక లేకుండా గడుపుతున్నప్పటికీ, తమ అనుబంధాన్ని పటిష్ఠంగా ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటిస్తామని చెప్పారు. "వృత్తిపరమైన పనుల వల్ల మేమిద్దరం కలిసి గడిపే సమయం తక్కువగా ఉంటుంది. అందుకే ఆ బంధాన్ని నిలబెట్టుకోవడం కోసం కొన్ని రూల్స్ పెట్టుకున్నాం. ముఖ్యంగా మేమిద్దరం హైదరాబాద్‌లోనే ఉన్నప్పుడు ఉదయం, రాత్రి భోజనం తప్పనిసరిగా కలిసే చేయాలని నిర్ణయించుకున్నాం" అని చైతన్య వివరించారు.వారాంతాలను పూర్తిగా తమ వ్యక్తిగత సమయానికే కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. "ఆదివారాల్లో మాకు నచ్చినట్లు సమయం గడుపుతాం. ఇంట్లోనే మూవీ నైట్ ప్లాన్ చేసుకోవడం, బయట షికారుకు వెళ్లడం, ఇష్టమైన వంటకాలు ఆర్డర్ చేసుకోవడం లేదా కలిసే వండుకోవడం వంటివి చేస్తూ ఆ క్షణాలను ప్రత్యేకంగా మార్చుకుంటాం" అని తెలిపారు. తనకు రేసింగ్ అంటే ఇష్టమని, శోభితకు పుస్తకాలు చదవడం ఇష్టమని చెప్పారు. అయితే, ఇటీవల ఆమెకు రేస్‌ట్రాక్‌పై డ్రైవింగ్ నేర్పించానని, ఆ అనుభూతిని ఆమె ఎంతో ఆస్వాదించిందని చైతన్య సంతోషంగా పంచుకున్నారు.ఇదే ఇంటర్వ్యూలో తన నిజ జీవిత హీరోల గురించి కూడా చైతన్య మాట్లాడారు. తన కుటుంబ సభ్యులు కాకుండా, పారిశ్రామికవేత్త రతన్ టాటా అంటే తనకు ఎంతో గౌరవమని, ఆయన్ను ఒక స్ఫూర్తి ప్రదాతగా చూస్తానని చెప్పారు. "ఎలాన్ మస్క్ జీవిత ప్రయాణం నన్ను ఆశ్చర్యపరుస్తుంది. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ అంటే కూడా నాకు అభిమానం. ఇక మన తెలుగు చిత్ర పరిశ్రమకు వస్తే, దర్శకుడు రాజమౌళి అంటే ఎంతో ఇష్టం" అని నాగ చైతన్య తన అభిప్రాయాలను వెల్లడించారు.

## 'కాంటా లగా' బ్యూటీ
# షఫాలీ మృతిలో మిస్టరీ..



ఒకప్పటి సెన్సేషనల్ సాంగ్ 'కాంటా లగా'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి షఫాలీ జరివాలా (42) ఆకస్మిక మరణం తీవ్ర కలకలం రేపుతోంది. ఆమె గుండెపోటుతో మరణించారని తొలుత వార్తలు వచ్చినా, ఈ ఘటనపై తాజాగా ముంబయి పోలీసులు స్పందించడంతో కేసు కీలక మలుపు తిరిగింది. షఫాలీ మరణాన్ని అనుమానాస్పద మృతిగా పరిగణిస్తున్నామని, అసలు కారణాలు ఇంకా తెలియరాలేదని ప్రకటించడంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో తమకు సమాచారం అందిందని, వెంటనే అంధేరిలోని షఫాలీ నివాసానికి చేరుకున్నామని తెలిపారు. "మేము ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించాం. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం కూపర్ ఆసుపత్రికి తరలించాం. ఆమె మరణానికి దారితీసిన కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు" అని పోలీసులు వెల్లడించారు. ఈ కేసును అనుమానాస్పద ఘటనగానే నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముంబయి పోలీసు తెలిపారు. ప్రస్తుతం ఫోరెన్సిక్ నిపుణులు షఫాలీ అపార్ట్‌మెంట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో పోలీసులు ఆమె ఇంట్లో పనిచేసే సిబ్బందిని, వంట మనిషిని ప్రశ్నిస్తున్నారు.శుక్రవారం రాత్రి షఫాలీ అస్వస్థతకు గురవడంతో ఆమె భర్త పరాగ్ త్యాగీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, కుటుంబ సభ్యులు ఆమె మరణంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. "రాత్రి 11:15 గంటలకు షఫాలీని ఆసుపత్రికి తీసుకొచ్చారు. కానీ, అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది" అని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఈ ఉదయం షఫాలీ భర్త పరాగ్ త్యాగీ తమ పెంపుడు శునకంతో అపార్ట్‌మెంట్ బయట నడుస్తూ కనిపించడం గమనార్హం.2002లో విడుదలైన 'కాంటా లగా' రీమిక్స్ వీడియో సాంగ్‌తో షఫాలీ జరివాలా ఒక్క రాత్రిలోనే స్టార్‌గా ఎదిగారు. యువతలో ఆమెకు విపరీతమైన క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత సల్మాన్ ఖాన్ నటించిన 'ముజ్సే షాదీ కరోగి' చిత్రంలో చిన్న పాత్రలో మెరిశారు. పలు టెలివిజన్ రియాలిటీ షోలలో పాల్గొన్న ఆమె, హిందీ బిగ్‌బాస్ సీజన్ 13లోనూ పోటీదారుగా అడుగుపెట్టారు. వ్యక్తిగత జీవితంలో ఆమె మొదట మ్యుజీషియన్ హర్మీత్ సింగ్‌ను వివాహం చేసుకుని, ఆ తర్వాత విడిపోయారు. అనంతరం నటుడు పరాగ్ త్యాగీని పెళ్లి చేసుకున్నారు. షఫాలీ మృతికి అసలు కారణం పోస్ట్‌మార్టం నివేదిక వస్తేనే తేలనుంది. పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ఆద్యంతం ఆసక్తికరంగా జూనియర్ టీజర్




ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి, రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్ శుక్రవారం విడుదలైంది. ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటూ అందరినీ అలరిస్తోంది. కాలేజీ స్టూడెంట్‌గా కనిపించే హీరో కిరీటి, హీరోయిన్ శ్రీలీల మధ్య కథతో సినిమా నడుస్తుంది. టీజర్‌లో కిరీటి అదరగొట్టాడు. హీరోయిన్ శ్రీలీల కూల్‌గా కనిపించింది. టీజర్ చివరలో బాస్ పాత్రలో జెనీలియా డిసౌజా కనిపించడం మరింత ఆసక్తికరంగా ఉంది. జూనియర్ తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళ భాషలలో జూలై 18న గ్రాండ్ గా విడుదల కానుంది.

# ఆలయానికి రోబో ఏనుగును విరాళంగా ఇచ్చిన నటి త్రిష



ప్రముఖ సినీ నటి త్రిష తన జంతు ప్రేమను మరోసారి వినూత్నంగా చాటుకున్నారు. చెన్నైలోని ఓ ప్రసిద్ధ ఆలయానికి యాంత్రిక ఏనుగును (రోబోటిక్ ఏనుగు) విరాళంగా అందించారు. జంతు సంక్షేమ సంస్థ 'పీపుల్ ఫర్ క్యాటిల్ ఇన్ ఇండియా (పీఎఫ్‌సీఐ)'తో కలిసి ఆమె ఈ బృహత్కార్యాన్ని చేపట్టారు.చెన్నైలోని శ్రీ అష్టలింగ ఆదిశేష సెల్వవినాయకర్ ఆలయానికి 'గజ' అని పేరు పెట్టిన ఈ రోబోటిక్ ఏనుగును త్రిష కానుకగా ఇచ్చారు. గురువారం మంగళవాయిద్యాల మధ్య, వేద మంత్రోచ్ఛారణల నడుమ పీఎఫ్‌సీఐ సంస్థ నిర్వాహకులు ఈ యాంత్రిక ఏనుగును ఆలయ పూజారులకు శాస్త్రోక్తంగా అప్పగించారు. ఇకపై ఆలయంలో జరిగే పూజలు, ఉత్సవాలు, ఊరేగింపుల వంటి కార్యక్రమాలలో ఈ రోబో ఏనుగును వినియోగించనున్నారు.సాధారణంగా ఆలయ వేడుకల్లో నిజమైన ఏనుగులను ఉపయోగించడం వల్ల అవి శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతున్నాయని జంతు ప్రేమికులు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మూగజీవాలకు ఎలాంటి హాని కలగకుండా సాంప్రదాయాలను కొనసాగించేందుకు ఈ రోబోటిక్ ఏనుగును అందించడం ఒక గొప్ప ముందడుగుగా భావిస్తున్నారు.ఈ ఆలయానికి వేడుకల కోసం యాంత్రిక ఏనుగును బహుమతిగా ఇవ్వడం ఇదే మొదటిసారని భక్తులు తెలిపారు. జంతువుల పట్ల త్రిష చూపిన ఈ కరుణ, ఆమె తీసుకున్న చొరవను పలువురు భక్తులు, నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613